క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం

ఘంటసాల(అవనిగడ్డ): విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చల్లపల్లి సీఐ బీ.భీమేశ్వర రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మత్తు పదార్థాల దుష్పరిణామాలు–రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్‌ఐ కుడిపూడి శ్రీనివాసు పాల్గొన్నారు.

అవనిగడ్డ: విద్యార్థులు అనాలోచితంగా మత్తు పదార్థాలకు అలవాటు కావద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అవనిగడ్డ సీఐ జి.సూకరాజు తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్‌ఈబీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

మచిలీపట్నంటౌన్: చిలకలపూడిలోని కామాక్షి సమేత రత్నాంబేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాపాక సత్యనారాయణమూర్తి, మీనాక్షి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్

చల్లపల్లి: విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నతులుగా ఎదగాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. శనివారం విజయ క్రాంతి జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ వేడుకలు నిర్వహించారు. నాయకులు కడవకొల్లు నరసింహారావు విజేతలకు బహుమతులు అందించారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- మంత్రి జోగి రమేష్
- మల్లవోలులో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం

గూడూరు: ప్రభుత్వ పథకాలు పొందడానికి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ గతంలో ప్రభుత్వ కార్యాలయాలు, నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే పరిస్థితి ఉండేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులను వెతుక్కుంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడప వద్దకే వస్తున్నాయని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. గూడూరు మండలం మల్లవోలు-1 గ్రామ సచివాలయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం రెండో రోజు జరిగింది. మంత్రి జోగి రమేష్ గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ వాటి ద్వారా పొందిన లబ్ధికి సంబంధించిన బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. అవ్వా పెన్షన్ వస్తుందా... తాతా ఆరోగ్యం ఎలా ఉంది అంటూ మంత్రి జోగి రమేష్ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ గత ప్రభుత్వ పాలనకు, జగనన్న పాలనకు వ్యత్యాసాన్ని వివరిస్తూ ముందుకు సాగారు. మంత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు విషయంలో కులం, మతం, ప్రాంతం... చివరకు రాజకీయాలు, పార్టీలు పట్టించుకోవడం లేదన్నారు. అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలు అమలవుతాయనే సంకేతం ఇచ్చేలా ప్రతి అడుగు వేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అన్నింటినీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 95 శాతానికి పైగా నెరవేర్చారన్నారు. అయినప్పటికీ ఇంకా ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతుంటే వారిని గుర్తించి వారికి కూడా లబ్ధి చేకూర్చాలనే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు.



ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టాను లబ్ధిదారుకు అందిస్తున్న మంత్రి జోగి రమేష్

గడప వద్దకే సేవలు..

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పాలనా వికేంద్రీకరణకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. తద్వారా గడప వద్దకే ప్రభుత్వ పథకాలు అందించేలా సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చామని చెప్పారు. అవ్వాతాతలు, దివ్యాంగులు ఎన్నో ప్రయాసలు పడుతూ పెన్షన్ కోసం కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీన ఠంచనుగా సామాజిక పెన్షన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి నెలా నిత్యావసర వస్తువులను మోసుకువచ్చే అవసరం లేకుండా లబ్ధిదారుల ఇంటికే డోర్ డెలివరీ చేస్తున్నామన్నారు. అన్నివర్గాలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతోనే దేశంలో ఎక్కడా అమలు కాని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్న జగనన్నను నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు సురేష్ రంగబాబు, ఆర్బీకే చైర్మన్ పెదబాబు, సర్పంచి సాంబయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు రవి, రత్నారావు, సాయికుమారి, రామిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగనన్నకే సాధ్యం

మచిలీపట్నంటౌన్: సంక్షేమ పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. పదో డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్పొరేటర్ షేక్ ముంతాజ్‌బేగం, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ బాషాతో కలిసి గడప గడపకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కిట్టు మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అమలు చేసేందుకు అధ్యయనం చేస్తున్నారని చెప్పారు. తమ కుటుంబానికి మొత్తం రూ. 2,08,172, ఇంటిస్థలం, పక్కా ఇల్లు మంజూరైందని పీతల వెంకటేశ్వరరావు పేర్ని కిట్టుకు తెలిపారు. తమకు మొత్తం రూ. 61,652లు లబ్ధి చేకూరిందని వాకా దేవచంద్రరాజు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కాగిత జవహర్‌లాల్, మీర్ అస్గర్‌అలీ, గోపిశెట్టి సతీష్, నాయకులు మాదిరెడ్డి అంజిబాబు, యూనస్, రబ్బానీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జల్లు స్నానం ట్రయల్ రన్

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలోని దుర్గా నాగేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహా శివరాత్రి ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయని ఆలయ ఏసీ ఎస్‌ఎస్ చక్రధరరావు తెలిపారు. కృష్ణానది వద్ద పుణ్యస్నానాలు చేసే ప్రదేశంలో పైప్ లైన్ ద్వారా ఏర్పాటు చేసిన జల్లు స్నానం ట్రయల్ రన్‌ను శనివారం నిర్వహించారు. ఆలయ ఏసీ మాట్లాడుతూ ఉత్తర దిక్కుగా ప్రవహిస్తున్న పెదకళ్లేపల్లి కృష్ణానదిలో మహా శివరాత్రి నాడు పుణ్యస్నానాలు ఆచరించేందుకు లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారని చెప్పారు. వృద్ధులు, దివ్యాంగులు, పిల్లలను దృష్టిలో పెట్టుకుని జల్లు స్నానానికి సిద్ధం చేశామని వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: ఎనిమిదో డివిజన్‌లో ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) శనివారం పర్యటించారు. ఇందిరమ్మ, అరుణోదయ కాలనీల్లో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమ గృహాలకు ఇంటి పన్నులు వేయించాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని పేర్ని నానిని ఆ ప్రాంత మహిళలు కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి ఆయన అధికారులను ఆదేశించారు. డివిజన్‌లోని మునిసిపల్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో నాడు -నేడు పథకం ద్వారా భవన నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్కూల్ ఆవరణలోని పాక శిథిలం కావడంతో దాని స్థానంలో తమ సొంత ఖర్చులతో షెడ్డు నిర్మిస్తానని ఎమ్మెల్యే పేర్ని నాని హామీ ఇచ్చారు. నగర అసిస్టెంట్ కమిషనర్ కె. అనూష, ఎంఈఓ దుర్గాప్రసాద్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



మహిళల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పేర్ని నాని

ఇంటింటికీ వెళ్లి పథకాలు వివరించండి

ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: గృహ సారథులు, కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, నియోజకవర్గ పరిశీలకులు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అన్నారు. కోడూరు, విశ్వనాథపల్లి సచివాలయాల వద్ద ఆయా క్లస్టర్ల పరిధిలోని గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావాలంటే 2024 ఎన్నికల్లో మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకోవాలని అన్నారు. ప్రత్యేకంగా ముద్రించిన కిట్లను అందించారు. వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ పరిశీలకుడు కడవకొల్లు నరసింహా రావు, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

108 వాహనంలో మహిళ ప్రసవం

కోడూరు: పురిటినొప్పులతో ఆస్పత్రికి వెళ్లేందుకు 108 వాహనం ఎక్కిన మహిళ అదే వాహనంలో ప్రసవించింది. అవనిగడ్డ మండలం అశ్వారావుపాలెంకు చెందిన ఉప్పలపాటి దుర్గారావు.. భార్య నాంచారమ్మ, పిల్లలతో కలిసి కూలీ పనుల నిమిత్తం కోడూరులో నివాసముంటున్నారు. నాంచారమ్మ గర్భవతి. శుక్రవారం అర్ధరాత్రి ఆమెకు పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. దుర్గారావు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా మోపిదేవి 108 వాహనం కోడూరుకు చేరుకుంది. రాత్రి 2.20 గంటల సమయంలో నాంచారమ్మను 108 వాహనంలో అవనిగడ్డ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా వి.కొత్తపాలెం గ్రామానికి వెళ్లే సరికి నాంచారమ్మకు పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. వాహన సిబ్బంది, కుటుంబీకులు ప్రసవం చేశారు. నాంచారమ్మ పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారు. వీరిని అవనిగడ్డ ఆస్పత్రిలో చేర్పించినట్లు అంబులెన్స్ ఈఎన్టీ సీహెచ్ వెంకట నరసయ్య, పైలెట్ ఎం.సురేష్ తెలిపారు.

ఆత్మవిశ్వాసంతోనే క్యాన్సర్‌పై విజయం

గూడూరు: క్యాన్సర్ బారిన పడిన అనేక మంది ఆత్మవిశ్వాసంతో జయిస్తున్నారని గూడూరు సీహెచ్‌సీ వైద్యురాలు అక్కినేని అజిత అన్నారు. వరల్డ్ క్యాన్సర్ డేను పురస్కరించుకుని గూడూరు సీహెచ్‌సీలో రోగులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్యాన్సర్‌కు వైద్య చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. క్యాన్సర్ బారిన పడిన అనేక మంది సెలబ్రిటీలు క్యాన్సర్ నుంచి స్వస్థత పొంది సాధారణ జీవితం గడుపుతున్నారన్నారు. రోగులకు వైద్యంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు మనోధైర్యాన్ని ఇవ్వాలని సూచించారు. వైద్యులు హరిప్రసాద్, అల్లూరమ్మ, చందన, భారతి, హేమలత పాల్గొన్నారు.

11న లోక్ అదాలత్

బంటుమిల్లి: లోక్ అదాలత్ కార్యక్రమం ఈనెల 11వ తేదీన జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో జరుగుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి ఈ. సుధాకర్ తెలిపారు. శనివారం ఆయన చాంబర్‌లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులు, పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించదగిన కేసులను రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. సెబ్ సీఐ సతీష్‌కుమార్, పెడన సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

భజరంగదళ్ దివిసీమ ప్రముఖ్‌గా ప్రతాప్

లక్ష్మీపురం(చల్లపల్లి): విశ్వ హిందూ పరిషత్ భజరంగదళ్ దివిసీమ ఏడు మండలాల ప్రముఖ్‌గా లక్ష్మీపురం గ్రామానికి చెందిన పీతా లక్ష్మీ ప్రతాప్ నియమితులయ్యారు. జిల్లా ప్రముఖ్ మహంకాళి శ్రీరామ్‌శర్మ ఆయనకు బాధ్యతలు అప్పగించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థి ప్రతిభ

కోనేరుసెంటర్: బందరు మండలం బుద్దాలపాలెం గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి గట్టి నాగసాయి అజయ్‌వర్మ రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో తృతీయ స్థానం సాధించాడు. పోటీలు ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలోని చిల్లకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగాయి. అజయ్‌వర్మను శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ మధుసూదనరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

చోరీకి వచ్చారు.. సీసీ కెమెరాకు చిక్కారు

లక్ష్మీపురం (చల్లపల్లి): లక్ష్మీపురం శివారు శివరామదుర్గాపురంలో సాలా రెడ్డిమ్మ ఇంటి ముందు నిలిపి ఉన్న ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. శుక్రవారం అర్ధరాత్రి ఇద్దరు యువకులు ఇంటి ముందు నిలిపిన రెండు ద్విచక్ర వాహనాలను డమ్మీ తాళాలతో స్టార్ట్ చేసేందుకు యత్నించారు. ఒక వాహనం స్టార్ట్ కావడంతో వారు ఆ వాహనాన్ని తీసుకుని వెళ్లిపోయారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. శనివారం ఉదయం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డిస్కస్‌త్రోలో బోనికకు స్వర్ణ పతకం

పెడన: రాష్ట్ర స్థాయి డిస్కస్ త్రో పోటీల్లో నందమూరు శ్రీ వాసవి పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థిని యార్లగడ్డ బోనిక స్వర్ణ పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైంది. విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర స్థాయిలో ఇటీవల జరిగిన పోటీల్లో ప్రతిభ చూపిన ఆమెను కాలేజీలో శనివారం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీకే ప్రసాద్, కాలేజీ చైర్మన్ జి. ప్రసాద్, సెక్రటరీ టి. మెహర్‌బాబా, కరస్పాండెంట్ కె. కుమార్‌బాబు అభినందించారు.

అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం

పెడన: చౌడేశ్వరిదేవి జ్యోతిర్మయి అమ్మవారి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం సాయంత్రం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

కల్యాణమస్తు బంగారు నాణెం అందజేత

బంటుమిల్లి: గొల్లగూడెం గ్రామానికి చెందిన యలవర్తి శ్రీనివాసరావు కుమార్తెకు కృష్ణా మిల్క్ యూనియన్ సభ్యులు కల్యాణమస్తు పథకం కింద నాలుగు గ్రాముల బంగారు నాణెంను శనివారం అందజేశారు. యూనియన్ జిల్లా సభ్యుడు అర్జా నగేష్‌బాబు, టి. సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నోటి క్యాన్సర్‌పై అవగాహన

మచిలీపట్నంటౌన్: నోటి క్యాన్సర్ సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ వైద్యుడు రావి శ్రీనివాసరావు అన్నారు. శనివారం హిందూ కళాశాల ఆవరణలోని వెంకటేశ్వర హైస్కూల్‌లో నోటి క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించి పలు సూచనలు చేశారు. శ్రీరంగ శ్రీనివాసు, ఉష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కోనేరుసెంటర్: విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని చిన్నాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు నడకుదిటి నాగనిఖిల అన్నారు. చిన్నాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది శనివారం రుద్రవరం గురుకుల కళాశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అనిల్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ జానకెనడీ పాల్గొన్నారు.

కార్మికులు బీమా చేయించుకోవాలి

మోపిదేవి: కార్మికులు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఎస్. గోపాల్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం భవన నిర్మాణ కార్మికులు, ఉపాధి కూలీలు, వలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కార్మికుడు బీమా చేయించుకోవడం ద్వారా కుటుంబానికి భద్రత కల్పించిన వారవుతారన్నారు.

లీగల్ ఎయిడ్ క్లినిక్ పరిశీలన

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా ప్రభుత్వాస్పత్రిలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆర్‌ఎంఓ రామచంద్రరావు, ప్యానల్ అడ్వకేట్ ఎస్ గోవర్ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన

కోడూరు: హంసలదీవి వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం రాజ్యలక్ష్మీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కుప్పా వంశీయులు పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈఓ సుధాకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మచిలీపట్నంటౌన్: కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లు, ఇంజినీర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు శనివారం టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మల్లికార్జునరావుకు వినతిపత్రం అందజేశారు. మచిలీపట్నం అసోసియేషన్ అధ్యక్షుడు పి. మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ

మోపిదేవి: మండల స్థాయి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ కార్యక్రమం ఆదివారం స్థానిక జెడ్పీపాఠశాల ఆవరణలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావు, అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు పిల్లంగోళ్ల శ్రీ లక్ష్మీ పాల్గొంటారని చెప్పారు.

పేదలకు ఉచిత న్యాయ సేవలు

పెడన: పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించేందుకు కోర్టులు తగిన ఏర్పాట్లు చేస్తాయని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఆర్. కృష్ణ అన్నారు. శనివారం స్థానిక వాసవి కల్యాణ మండపంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కల్పించారు.

పాఠశాల భవనానికి శంకుస్థాపన

కోనేరుసెంటర్: భోగిరెడ్డిపల్లిలోని రామఖండంలో రూ. 30 లక్షలతో నిర్మించనున్న పాఠశాల భవనానికి శనివారం కిట్టు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన జరుగుతోందన్నారు.

హోమియో మందుల పంపిణీ

మచిలీపట్నంటౌన్: హజ్రత్ అలీ జయంతిని పురస్కరించుకుని శనివారం స్వాతి పబ్లిక్ స్కూల్‌లో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు మందులు పంపిణీ చేశారు.